# పరువాటూరు

కైరము



సావిత్రికి పత్రికలు చదివి చదివి విసుగెత్తింది. రాత్రి తొమ్మిది గంటలైనా శర్మ రాలేదు. ఒక్కసారి మేడమీదికి వెళ్లి గాలి పీల్చుకుందామని మెట్లవేపు దారి తీసింది.

మేడమెట్ల పక్కన వరండాలో వంటాయన శాస్త్రి తల మోకాళ్లమీద పెట్టుకుని కూర్చున్నాడు.

'శాస్త్రిగారూ! మీరు భోజనం చేసెయ్యండి. డాక్టరుగారు యివాళ ఆలస్యంగా యింటికి వస్తారు. మా యిద్దరికీ వంటింట్లో టేబిల్ మీద అన్నీ పెట్టేసి, మీరు భోజనంచేసి వెళ్లి పడుకోండి.'

సావిత్రి మాటలు విని తలపైకెత్తి చూసి, శాస్త్రి తిరిగి తల వంచుకున్నాడు.

'నాకేం తొందరమ్మా! బాబురానీ తింటాను' శాస్త్రి మొఖంలో వున్న దిగులు చూసింది సావిత్రి.

'దేనికి శాస్త్రిగారూ బాధపడుతున్నారు?'

దేనికేమిటమ్మా! డబ్బులేనివాళ్లకి, నాలాంటి పేదవాళ్లకి అన్నీకష్టాలే, అన్నీ బాధలే. మా అబ్బాయి ఈ యేడు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష యిచ్చాడు. మంచి మార్కులతో పాసయ్యాడు. ఇప్పుడు కాలేజీలో చదువుతానంటాడు. వాడిని పై చదువులు చదివించే స్తోమత నాకెక్కడమ్మా? వాడు స్కాలర్‌షిప్‌మీద చదువుకుంటాడుట. నా కవి ఏం తెలుస్తాయమ్మా? ఎవరో బాబుగారిలాంటి వాళ్లు చూడాలి కాని!'

శాస్త్రి గొంతులో బాధచూసి సావిత్రి జాలి పడింది.

'ఏదీ మీ అబ్బాయి వెల్లూరినించి ఎప్పుడు వచ్చాడు? నాకు చూపలేదేం? ఈ మారు నాకు చూపించండి. మంచి మార్కులు వస్తే, కాలేజీలో స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నిద్దాం' అంటూ సావిత్రి మేడమీదకి నడిచింది.

సావిత్రి, భర్త యిద్దరూ ఉద్యోగస్థులే. సావిత్రి విశాఖపట్నం స్త్రీల కళాశాలలో లెక్చరర్‌గావుంది. ఆమె భర్త శర్మ డాక్టరు. కె. జి. హెచ్. లో పని చేస్తున్నాడు. వాళ్లు ద్వారకానగరంలో కట్టిన క్రొత్తయిళ్లలో ఒకటి అద్దెకి తీసుకున్నారు. ఇద్దరూ ఉద్యోగస్థులే అవడంవల్ల యింట్లో వంటకి ఒకమనిషి కావాలి. సావిత్రికి పెళ్లైన మూడు సంవత్సరాలలో ఎంతోమంది వంటవాళ్లని పెట్టుకుంది. ఒక్కరూ ఆరునెలలూ, మూడునెలలూ కంటె పైన వుండేవారు కాదు. పైగా యింట్లో దుబారా ఎక్కువగా అయ్యేది. రకరకాల వంట మనుషులతో విసిగి పోయిన సావిత్రికి శాస్త్రి రాక కొంచెం తెరపినిచ్చింది. శాస్త్రి వారింటికి రావటం కూడా తమాషాగా జరిగింది. సావిత్రి, శర్మా వేసంగిలో మద్రాసునించి వస్తున్నప్పుడు శాస్త్రి రైల్లో కనిపించాడు. తను బ్రతికి చెడ్డ

పాడినని, ఎవరేనా గౌరవనీయులైన కుటుంబీకుల యిళ్లల్లో వంటచేసుకు బ్రతకాలని వుందనీ శాస్త్రి అన్నాడు. సావిత్రీ, శర్మా వెంటనే తమయింటికి రమ్మని పిలిచారు.

శాస్త్రి చక్కగా వంట చేస్తాడు. నమ్మకస్థుడు. ముఖ్యంగా చాలా పొదుపరి. ఈ కారణాలవల్ల ఒక్క నెలరోజులలోనే భార్యాభర్త లిద్దరి లభిమానాన్ని చూర గొన్నాడు.

మర్నాడు ప్రొద్దున్న తొమ్మిది గంట లకి సావిత్రి, శర్మా ఫలహారం చేస్తు న్నప్పుడు శాస్త్రి వచ్చి సావిత్రితో మెల్లిగ తన కొడుకు వచ్చినట్టు చెప్పాడు.

సావిత్రి వెనక్కి తిరిగి చూసింది. తెల్లగా, సన్నగా తలుపుని ఆనుకుని నుంచున్నాడు ఒకబ్బాయి. అతని పెద్ద కళ్లల్లో అమాయకత్వం తొణికిసలాడు తోంది. చక్కటి కనుముక్కు తీరుతో ముచ్చటగా వున్నాడు.

'ఇలారా ! నీ పేరేమిటి ?'

'శ్యామాశాస్త్రి' అంటూ అతను సావిత్రి దగ్గరకి వచ్చాడు. నిక్కరు వేసుకున్న శ్యామాశాస్త్రి తన వయసు కంటె చాలా చిన్నవాడుగా వున్నాడు. 'ఏదీ నీ మార్కులు చూస్తాను, ఎస్. ఎస్. ఎల్. సి రిజిస్టరు చూపు.'

శ్యామాశాస్త్రి యిచ్చిన పుస్తకం విప్పి మార్కులు చూసిన సావిత్రి ముఖం వికసించింది.

'ఎంతమంచి మార్కులు వచ్చాయో చూడండి' అంటూ భర్తముందరకి తోసింది పుస్తకాన్ని. అన్ని సబ్జక్టులలో అరవైపైన వచ్చాయి. లెక్కలలో నూటికి నూరు వచ్చాయి. శర్మకూడా మెచ్చు కున్నాడు.

'పాటలేమైనా పాడగలవా ?' నవ్వుతూ అడిగాడు శర్మ.

'ఊహూ' అన్నాడు సిగ్గుపడుతూ శ్యామాశాస్త్రి.

'శ్యామాశాస్త్రికి స్కాలర్‌షిప్పు కోసం ప్రయత్నించండి. కాలేజీలో చేరతాడు. లెక్కలు మెయిన్ తీసుకు చదువుతాడు' అంటున్న సావిత్రి మాటలకి అడ్డుగా 'లేదక్కా నేను బయాలజీ తీసుకుంటా' అన్నాడు శ్యామాశాస్త్రి.

'అక్కా' అన్న పిలుపు విని సావిత్రి ఒక్కసారి ఆశ్చర్యంగా చూసింది. శ్యామా శాస్త్రి అమాయకంగా చూస్తున్నాడు. వెంటనే మనసులో ఎందుకో శ్యామా శాస్త్రి అంటే యిష్టం కలిగింది.

'నేను యీ విషయం చూస్తాలే' అన్నాడు శర్మ ఫలహారం ముగించి, లేస్తూ.

శ్యామాశాస్త్రికి స్కాలర్‌షిప్పువచ్చింది. పి. యు. సి. లో చేరాడు. స్కాలర్ షిప్పు డబ్బుతో హాస్టల్‌లో వుండేవాడు. శాస్త్రి తనకి యిచ్చేనెల జీతం కొడుక్కి యిచ్చేసేవాడు శ్యామాశాస్త్రి పి. యు. సి. కూడా ఫస్టుక్లాసులో మంచి మార్కులతో పాస్ అయ్యాడు;

'శ్యామాశాస్త్రి మెడికల్ కాలేజీలో చేరాలను కుంటున్నాడుట. మిమ్మల్ని సహాయం చెయ్యమని శాస్త్రిగారు అడుగు తున్నారు' అంటూ ఒకరాత్రి శర్మతో, సావిత్రి చెప్పింది.

'మెడిసిన్ చదవటం అంత సులువు కాదు. బోల్డుడబ్బు ఖర్చు అవుతుంది' శర్మ ఆలోచిస్తూ అన్నాడు.

'అతనికి స్కాలర్‌షిప్పు వస్తుందిగా?'

'ఆ డబ్బు సరిపోదు సావిత్రీ. ఎన్నో కొనవలసి వుంటుంది, పైగా ఆరేళ్ల చదువు'

'తెలివైనవాడు, పైకి రావలసినవాడు అతను. మనం సహాయం చేద్దాం. ఇలాంటి తెలివైన వాళ్లు పైకి రాకపోతే దేశానికే నష్టం' సావిత్రి క్లాసులో పాఠం చెప్తున్నట్టు చెప్పింది. శర్మ నవ్వాడు. సావిత్రికి శ్యామాశాస్త్రి అంటే అభి మానం అని తెలుసు.

'సరేనండి టీచరుగారూ, తమరు ఆజ్ఞాపించి నట్టేచేస్తాం.' శర్మ హాస్యం చేశాడు. సావిత్రి చిరుకోపంతో తను చదువుతున్న పేపరు అతని మీదికి విసిరేసి లోలోపల నవ్వుకుంటూ ప్రక్కకి తిరిగి పడుకుంది.

'అక్కా. నేనివ్వాళ మెడికల్ కాలేజీలో చేరాను' అంటూ యింత ముఖం చేసుకుని సంతోషంగా వచ్చి చెప్పాడు శ్యామా శాస్త్రి.

'అంతా అమ్మగారి చలవ. బాబుగారి చలవ' అంటూ కళ్లు తుడుచుకున్నాడు శాస్త్రి సంతోషంగా.

తండ్రీ కొడుకు లిద్దరి సంతోషాన్ని చూసి ఆనందించింది సావిత్రి.

'బాగా చదువుకుని, మంచిపేరు తెచ్చుకో'

'తప్పకుండా అక్కా, డాక్టరుగారికి నా థాంక్స్ అందచెయ్యండి.'

శ్యామాశాస్త్రి కాలేజీలో చేరిన దగ్గిర నించీ శాస్త్రిలో చాలామార్పు వచ్చింది. ఇంట్లో అన్నీ వేళకి అమర్చి పెట్టడమే కాకుండా, సావిత్రిని అభిమానంగా చూసే వాడు. సావిత్రి కూడా శాస్త్రిని కనిపెట్టి చూసేది. పండగలు వస్తే, పిండివంటలు తీసుకువెళ్లి హాస్టల్‌లో వున్న కొడుక్కి యిచ్చి రమ్మనేది పుస్తకాలు కొనుక్కో డానికి శ్యామా శాస్త్రికి డబ్బు యిచ్చేది.

* * *

సావిత్రి ఒకనాడు సాయంత్రం యింటికి వచ్చే సరికి తలుపు తాళంవేసి వుంది. ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లని శాస్త్రి ఎక్కడికి వెళ్లాడా అని ఆశ్చర్య పోతూ ప్రక్కవాళ్లదగ్గిర తాళం తీసుకు యింట్లోకి వెళ్లింది. శాస్త్రి బజారుకి వెళ్లినా సాయంత్రం నాలుగింటి కల్లా యింటికి వచ్చేస్తాడు.

రాత్రి దీపాలు పెట్టాక, వగర్చు కుంటూ, దిగాలు ముఖంతో వచ్చాడు శాస్త్రి.

'ఎక్కడికి వెళ్లారండీ?' సావిత్రి గుమ్మంలోనే అడిగింది.

'ఏం చెప్పనమ్మా! మా శ్యాముడికి జ్వరం, వళ్లు పేలిపోతోంది. పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. వాడి స్నేహితుడు వచ్చి చెబితే హాస్టల్‌కి వెళ్లాను' అన్నాడు శాస్త్రి కళ్లనీళ్లతో.

సావిత్రి భయపడింది. 'ఎప్పటి నించి జ్వరం?!'

'మూడురోజుల నించీ టమ్మా! ఇవాళ ఎక్కువగా వుంటే నాకు కబురు చెప్పారు! బాబుగారు వచ్చి ఒక్కసారి చూస్తే బాగుండును' శాస్త్రి చిన్న పిల్లవాడిలా ఏడుస్తూ నుంచున్నాడు.

సావిత్రి కంగారుగా శర్మ రాక కోసం ఎదురు చూసింది. శాస్త్రి కొడుకుమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.

**1968 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలలో జరుగు ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభనష్టములు, సర్వీసులో ప్రమోషన్‌లు ట్రాన్సుఫర్లు, పిల్లల జననం, వివాహము సంతోషము



మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేయుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం ఒకసారి పొంది తృప్తి చెందగలరు.

PT DEV DUTT SHASTRI
Raj Jyotshi, (APM) P.B 86,
JULLUNDUR CITY.

**ప్రత్యేక చికిత్స**

Licenced under M. & T. P.
Act — Rule (83)

వీర్యస్తంభనము :- నరాల బలహీనత పోయి మంచిశక్తి కల్గుటకు పైకి మర్దనకు తైలం 1 సీసా రూ. 27/-. పైకం ముందుగా పంపాలి.

**డా. రత్నం సన్స్, (Estd 1904)**
ఆజంపురా రైల్వే వంతెన వద్ద,
New Malakpet,
హైదరాబాద్— 36 ఆం. ప్ర.

**రు. 20 కి గడియారం పొందండి**

మాచే క్రొత్తగా కనిపెట్టబడిన స్కీము ద్వారా రు. 147 విలువగల మా రోమర్ పాపులర్ వాచీని రు. 20 లకే పొందండి



నేడే మీ ఆర్డరు పంపండి

Romer Agencies, (AP 15)
Box 1441, DELHI-6.

**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**

నెలకు రు. 10/- వంతున సులభముగా చెల్లించి రు. 320 విలువగల 'టెలి క్వీన్'



పోర్టబుల్ 3 బ్యాండ్స్, ఆల్ వరల్డ్ 8 ట్రాన్సిస్టరీలు పొందండి వివరములకు :

ATLAS CO., (AP-22)
Box No. 1329, Delhi-6.

# ఏరుం దాటూరు

శర్మ రాత్రి ఎనిమిది గంటలకి వచ్చాడు. రాగానే సావిత్రి, శ్యామాశాస్త్రి జ్వరం గురించి చెప్పి, వెంటనే అతనిని చూడటానికి వెళ్ళమని తొందర చేసింది. శర్మ, శాస్త్రిని వెంట బెట్టుకు తన స్కూటర్‌మీద హాస్టల్‌కి వెళ్ళాడు.

రాత్రి పదకొండు గంటలదాకా శర్మ కాని, శాస్త్రికాని యింటికి రాలేదు. సావిత్రి ఆదుర్దాగా ఎదురు చూస్తూ కూచుంది. ఈ నాలుగేళ్ళల్లోగా శ్యామాశాస్త్రి అంటె యిష్టం ఏర్పడింది. అతను 'అక్కా' అని పిలుస్తూ వుంటే, తనకి తమ్ముళ్ళు లేరనే కొరత తీరినట్టు అనిపించేది. శ్యామాశాస్త్రి ఆరోగ్యం కోసం, క్షేమంకోసం సావిత్రి దేవుడిని ప్రార్థించింది. వంటింట్లోంచి ముందు గదిలోకి వచ్చేసరికి అలిసిపోయి నీరసంగా వస్తున్న శర్మ కనిపించాడు.

'ఎలా వున్నాడు శ్యామాశాస్త్రి?'

'టైఫాయిడ్ అని అనుమానంగా వుంది. హాస్పటల్లో చేర్చాం.'

శ్యామాశాస్త్రి పదిహేనురోజులు హాస్పటల్లో టైఫాయిడ్‌తో బాధపడుతూ వుండిపోయాడు. శాస్త్రి కొడుకుతోపాటు అక్కడే వుండిపోయాడు. సావిత్రి యింట్లోనూ, శర్మ హాస్పటల్లోనూ అన్నీ సమకూర్చి శాస్త్రికి, కొడుక్కి చాలా సహాయం చేశారు.

పథ్యం పెట్టిన మూడోరోజు హాస్పటల్ నించి పంపించేస్తామన్నారు శ్యామాశాస్త్రిని. ఆ సాయంత్రం శర్మతోపాటు, సావిత్రీ హాస్పటల్‌కి వెళ్ళింది. సన్నగా, నీరసంగా, బక్కచిక్కిపోయి, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకు పడుకున్నాడు శ్యామాశాస్త్రి. మంచంప్రక్కనే, నిద్ర లేమివల్ల లోతుకుపోయిన కళ్ళతో, దిగులుగా కూర్చున్నాడు శాస్త్రి. వాళ్ళిద్దరినీ చూడగానే సావిత్రి హృదయం జాలితో నిండిపోయింది.

'హాస్టల్లో పథ్యం ఏం జరుగుతుంది? పిల్లవాడు ఎప్పటికి కోలుకుంటాడు? మనింటికి తీసుకుపోదాం' అంది సావిత్రి భర్తతో.

తమ యింట్లో వరండాని అనుకునున్న మొదటిగదిలో శ్యామాశాస్త్రికి మంచం, పక్కా అమర్చారు సావిత్రీ, శర్మా. రోగి యింటికి రాగానే, అతని పథ్యం, పానం బాగోగులు చాలావరకు వాళ్ళమీదే పడ్డాయి. స్వంత తమ్ముడిని చూసుకున్నట్టే ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంది సావిత్రి. రోజూ సాయంత్రం అతని గదిలో కూచుని కాస్సేపు కబుర్లు చెప్పి అతని మనసుకి వుల్లాసం కలిగించేది.

శ్యామాశాస్త్రి ఆరోగ్యవంతుడయేసరికి నెల్లాళ్ళు పట్టింది. అప్పటికే పరీక్షలు దగ్గిరకి రావటంవల్ల, సావిత్రి అతనిని తమ యింట్లోనే వుంచేసుకుంది. పరీక్షలు రాసి, సెలవులకి నెల్లూరి దగ్గిర పల్లెటూళ్ళో వున్న తమ బంధువుల యింటికి వెళ్ళాడు శ్యామాశాస్త్రి.

* * *

పున్నమిరాత్రి. వరండాలో పడక కుర్చీలో, వెన్నెలలోకి చూస్తూ కూర్చున్నాడు శర్మ. ప్రక్కనే కుర్చీలో కూచుని, సావిత్రి భర్తకి తమలపాకులకి సున్నంరాసి అందిస్తోంది. ఇంత సావకాశంగా వెన్నెలలో కూచోడం వాళ్ళకి చాలా అరుదు.

'రేపు శ్యామాశాస్త్రి వస్తాడు' సావిత్రి తమలపాకులలో వక్కపొడివేస్తూ అంది.

'వూఁ వస్తే?'

సావిత్రి జవాబు చెప్పడానికి తటపటాయించింది.

'మనింట్లోనే వుండి చదువుకోమందాం. మేడమీది గది ఖాళీగానే వుంది కదా?'

సావిత్రి అంతగా ఎందుకు శ్యామాశాస్త్రిని గురించి చెపుతుందో శర్మకి తెలుసు. తను డాక్టరు. పగలనక, రాత్రనక ఎప్పుడుపడితే అప్పుడు హాస్పటల్‌కి వెళ్ళాలి. అర్జెంట్ కేసు వుంటే అర్ధరాత్రి పరిగెత్తాలి. ఒంటరిగా గడిపే సావిత్రికి, శ్యామాశాస్త్రి వుంటే బాగా పొద్దుపోతుంది.

'మనింట్లో పెట్టుకోవచ్చును. కాని దానివల్ల చాలా సమస్యలు వస్తాయి' శర్మ ఆలోచిస్తూ అన్నాడు.

'ఏం సమస్యలు వుంటాయి? డబ్బే కదా? పుస్తకాలవీ మనమే కొని యిస్తున్నాం. ఇంక తిండి పెట్టటమే కదా? అతని చదువు రెండేళ్ళలో పూర్తి అవుతుంది' సావిత్రి తనని తానే సమాధానపర్చుకుంటున్నట్టు అంది.

'ఏమో! అతను హాస్టల్‌లో వుంటేనే మంచిదేమో!' శర్మ తన నిశ్చయంగా చెప్పాడు.

'శ్యామా శాస్త్రిని చూస్తే నాకు తమ్ముడిని చూసినట్టు వుంటుంది. అతనంటే నాకు యిష్టం' సావిత్రి ఎటో చూస్తూ, శ్యామా శాస్త్రిని తమ యింట్లోనే వుంచుకోవాలన్నట్లు తన యిష్టాన్ని పరోక్షంగా చెప్పింది.

మర్నాడు 'అక్కా' అంటూ తలుపు తట్టిన శ్యామాశాస్త్రిని చూసి ఆశ్చర్యపోయింది సావిత్రి. ఈ నాలుగేళ్లలో పొడుగు ఎదిగాడు, లావు కాలేదు. కాని టైఫాయిడ్ తర్వాత వంటపట్టిన మంచి భోజనంతో, మందులతో, సెలవులలో దొరికిన విశ్రాంతితో మనిషి పుష్టిగా, అందంగా తయారయ్యాడు.

తన పక్కచుట్టా, ట్రంకుపెట్టెతో బయలుదేరబోతున్న శ్యామాశాస్త్రిని చూసి సావిత్రి 'ఎక్కడికబ్బాయ్ బయలుదేరావ్' అంటూ నవ్వుతూ ఆపింది.

'నా గూటికి, హాస్టల్‌కి'

'నీ గూడింక మా మేడమీది గది. నీ సామాను అక్కడికి పట్టుకెళ్లు' అంది సావిత్రి తిరిగి నవ్వుతూ.

కొడుకు వెనకే నీరుకావి పట్టిన పంచె కట్టుకుని నుంచున్న శాస్త్రి, వెంటనే వచ్చి సావిత్రి రెండుకాళ్లూ పట్టుకున్నాడు.

'అమ్మా నువ్వు దేవతవు. చెయ్యెత్తి మొక్కాలి' అన్నాడు గద్గదకంఠంతో.

సావిత్రి సిగ్గుపడుతూ యింట్లోకి వెళ్లిపోయింది.

సావిత్రి యింట్లో చేరిన శ్యామా శాస్త్రి అలవాట్లలో, దుస్తులలో కొద్ది నెలలోనే చాలా మార్పు వచ్చింది సావిత్రి తమతో సహా పక్కని, డైనింగ్ టేబిల్ మీదే శ్యామాశాస్త్రికి భోజనం ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు జతల బట్టలతో కాలం గడుపుతున్న అతని యిబ్బందిని చూసి, బజారుకి తీసుకువెళ్లి, అతనికి సరిపడినన్ని మంచి బట్టలు కొని యిచ్చింది.

శ్యామాశాస్త్రి సావిత్రిని 'అక్కా' అని పిలవడం వల్ల, సావిత్రి పరిచయస్థులు, స్నేహితులు, అతడిని సావిత్రి తమ్ముడిగానే భావించేవారు.

శ్యామాశాస్త్రి అందరితో సావిత్రి 'మా అక్క' అని గర్వంగా చెప్పుకునేవాడు. శ్యామాశాస్త్రి చేరిన తర్వాత, మొదటి నెలాఖరున శాస్త్రికి సావిత్రి ఆ నెల జీతం యివ్వబోతే, శాస్త్రి డబ్బు తీసుకోడానికి నిరాకరించేడు.

'అమ్మా. మీ దగ్గర డబ్బు తీసుకుంటానా? మా అబ్బాయిని మీ తమ్ముడిలా చూసుకుంటున్నారు. మా వాడికి మీరు చేస్తున్న సహాయానికి మేం ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము. నా చర్మం చెప్పులు కుట్టించి యిచ్చినా మీ ఋణం తీరదు తల్లీ' అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

* * *

సావిత్రీ వాళ్లు విశాఖపట్నంలో వుండటం వాళ్లకి పెద్ద యిబ్బంది తెచ్చిపెట్టింది. హాస్పటల్ పనిమీదో, కోర్టు పనిమీదో, యూనివర్శిటీ పనిమీదో ఎవరో ఒకరు ఎప్పుడూ వాళ్ల యింటికి అతిథులు, బంధువులూ వస్తూనే వుంటారు. ఆగష్టు నెలలో సావిత్రి మేనత్త, మొగుడూ వచ్చారు. మేనత్త మొగుడికి కోర్టులో పని వుంది.

డైనింగ్ టేబిల్ దగ్గర తమతో పాటు భోజనం చేస్తున్న శ్యామాశాస్త్రిని చూపించి, మేనత్త అడిగింది.

'ఎవరే యితను?'

'మా తమ్ముడు' అంది సావిత్రి గర్వంగా.

'నీకు తమ్ముడెవరే? నీ తరవాత మీ అమ్మకి పిల్లలు లేరుకదా?' అనుమానంగా అంది మేనత్త.

'అరువు తమ్ముడు' నవ్వుతూ అంది సావిత్రి

'అది తెలుస్తూనే వుంది. ఎక్కడినించి వచ్చాడని?'

'ఇక్కడినించే. మా శాస్త్రిగారి అబ్బాయి'

'సావిత్రి మేనత్త అర్థం అయినట్టు 'అలాగా' అంటూ తను భోజనం చెయ్యడంలో నిమగ్నమయింది.

'ఏ శాస్త్రిగారు?' అడిగాడు అర్థంకాని మేనత్త మొగుడు.

'అదేనండీ. ఆ వంటాయన కొడుకు.'

ఆ మాట వింటూనే శ్యామశాస్త్రి ముఖం చిన్నబోయింది. గబగబా నాలుగు ముద్దలు మింగి వెళ్లిపోయాడు అక్కడినించి.

సంభాషణ అంతా వింటూ అక్కడే నుంచున్న శాస్త్రి ముఖం [illegible] సారి చిరాకుగా మారిపోయింది. వాళ్లిద్దరి ప్రవర్తనా అర్థంకాని సావిత్రి ఆశ్చర్యపోయింది.

సాయంత్రం వంటరిగా దొరికిన శర్మతో, ఉదయం భోజనం దగ్గర జరిగిన సంభాషణా, తండ్రీ కొడుకుల ప్రవర్తనా చెప్పింది. 'వంటాయన కొడుకు అంటే తప్పేమిటి? నిజాన్ని చెప్పుకోడానికి చిన్నతనం ఏమిటి?' ఉద్రేకంగా అడిగిన సావిత్రి ప్రశ్నలకి సమాధానంగా 'అదంతే' అంటూ నవ్వేసి శర్మ అక్కడినించి వెళ్లిపోయాడు. సావిత్రి అయోమయంగా, విసుగ్గా అలాగే నిలుచుండిపోయింది చాలాసేపు.

ఈ సంభాషణతో బంధువులు, అతిథులూ సావిత్రి యింటికి వచ్చినప్పుడల్లా మామూలైపోయాయి. 'వంటాయన కొడుకు' 'శాస్త్రిగారి అబ్బాయి' అని చెప్పకుండా ఎలా తప్పించుకోవాలో తెలియదు సావిత్రికి. సావిత్రి అలా చెప్పినప్పుడల్లా చిన్నబుచ్చుకునేవాడు రామశాస్త్రి. చుట్టాలు వున్న రెండుమూడు రోజులూ తండ్రీ, కొడుకూ ఆ యింట్లో యిబ్బందిగా తిరిగేవారు. శాస్త్రి, అతిథులు వున్నన్ని రోజులూ ఏదో సణుగుతూ, చికాకు పడుతూవుండేవాడు. భోజనం, కాఫీ, టిఫిన్‌లు అతిథులకి పెట్టటానికి విసుక్కునేవాడు.

జనవరి మొదటివారం కూతుర్నీ, అల్లుడినీ చూసిపోదామని వచ్చారు సావిత్రి ముసలి తల్లిదండ్రులు విశ్రాంతిగా వుందామని వచ్చిన వాళ్ల ఆశలన్నీ ఎదురు తిరిగాయి. సావిత్రి తల్లికి హఠాత్తుగా గుండె జబ్బువచ్చి, ప్రాణంమీదికి వచ్చింది. ఒకరాత్రి ఆవిడని ఆసుపత్రిలో చేర్చి, సావిత్రి అన్నలకి, అక్కలకి టెలిగ్రాములు పంపించారు.

ఇంట్లో అంతా ఆదుర్దాగా, భయం భయంగా తిరుగుతున్నారు సావిత్రి రోజంతా హాస్పిటల్‌కి, యింటికి తిరుగుతూ గడుపుతుంది. ఒక మధ్యాహ్నం

# ఏరుదాటారు

**నాలుగు** మెతుకులు నోట్లో వేసుకు వెళదామని యింటికి వచ్చిన సావిత్రికి వాకిట్లో రిక్షా, రిక్షాలో శ్యామాశాస్త్రి సామాను కనపడింది. వాకిట్లో నుంచున్నాడు శ్యామశాస్త్రి. 'మీ కోసమే చూస్తున్నాను. ఇక్కడ నాకు చదువు సాగటం లేదు ఫైనలియరు కూడా. మా స్నేహితుడి గదికి వెళిపోతున్నాను. మీతో చెప్పి పోదామనే యిందాకటినించి కనిపెట్టుకున్నాను' అన్నాడు శ్యామశాస్త్రి. 'ఇప్పుడా శ్యాముడూ?' అర్థం కానట్టు అతని వేపే చూస్తోంది సావిత్రి.

'ఇప్పుడు చదువుకోకపోతే నాకు మంచి మార్కులు రావు. నా ముందు జీవితం అంతా పాడవుతుంది' అతని కళ్లల్లో కనిపించిన స్వార్థంచూసి మరి మాట్లాడ లేకపోయింది సావిత్రి.

'సరే మంచిది వెళ్ళు. గుడ్‌లక్' అంటూ గబగబ లోపలికి నడిచింది.

ఇన్నాళ్ళూ ఎవరినైతే తన తమ్ముడిగా ఆప్యాయంగా చూసుకుందో, ఎవరి తెలివి తేటలు అందం గర్వంగా అందరితో చెప్పుకుందో. ఆ శ్యామాశాస్త్రి యీరోజు తనని, 'నువ్వు నాకేం కావు. నీ కష్ట సుఖాలతో నాకు సంబంధంలేదు' అంటూ వెళిపోతున్నాడు. తింటున్న కంచంలో నీళ్ళు పోసేసి లేచిపోయింది.

టెలిగ్రాములు అంది సావిత్రి అక్కలూ, అన్నలూ దగ్గిర బంధువులూ కుటుంబాలతో విశాఖపట్నం తరలివచ్చారు. ఇంటి నిండా జనం. తల్లి ఆరోగ్యం గురించిన బెంగతో, యింట్లో మనుష్యులకి భోజనాలు, కాఫీలు అందజెయ్యడంలో సావిత్రికి క్షణం తీరిక, మనశ్శాంతి లేకుండా పోయాయి.

రాత్రిపదకొండుగంటలైంది అందరూ నిద్రకి వుపక్రమిస్తున్నారు. వంటింట్లోకి శాస్త్రికోసం వెళ్ళింది సావిత్రి. శాస్త్రి అప్పుడే వంటింటిపక్క తన గదిలో చాప పరుచుకుని నిద్రకి వుపక్రమిస్తున్నాడు.

'శాస్త్రిగారూ! రేపు కొంచెం వేగిరం, అయిదుగంటలకే రెండు కప్పుల కాఫీ చేసిపెట్టాలి.'

శాస్త్రి ఏం మాట్లాడలేదు.

'ఈ రోజు వచ్చిన మా బాబయ్య, పిన్ని రేపు తెల్లవారుఝామున బండికి వెళుతున్నారు'

శాస్త్రి ఒక్కసారి విదిలించినట్లు మాట్లాడాడు— 'అమ్మా యింతమందికి నేను చెయ్యలేను. తెల్లవారు ఝామునే చలిలో లేవడం నా శక్యం కాదు. నేను మీ యింట్లో వంటకి వప్పుకున్నప్పుడు యిద్దరు మనుష్యులకే వండాలని చెప్పారు. కాని ఎప్పుడూ మీ యింట్లోకి ఎవరో ఒకరు వస్తూనేవుంటారు.'

'ఇల్లన్నాక మనుష్యులు రారా? ఇప్పుడేదో అమ్మకి బాగుండకపోబట్టి యింత మందివచ్చి యిన్నాళ్ళు వున్నారు. అస్తమానూ వచ్చి మనిళ్ళల్లో ఎవరు వుంటారు? మీరు యిలాంటి కష్ట సమయంలో విసుక్కుంటే ఎలా శాస్త్రి గారూ?'

'నేను చెయ్యలేను బాబూ యీ పని. యీ జీతం లేనిపని' శాస్త్రి చాపమీద చతికిలపడ్డాడు.

సావిత్రికి కోపం కట్టలు తెంచుకు వచ్చింది. శాస్త్రిని చూస్తే అసహ్యం వేసింది.

'మిమ్మల్ని జీతం ఎవరు తీసుకో వద్దన్నారు? ఇప్పుడే తీసుకోండి' అంటూ గదిలోకి వెళ్ళి బీరువాలోంచి నోట్ల కట్టలు తెచ్చి శాస్త్రి ముందు పడేసింది.

ఉదయం లేస్తూనే వంటింట్లో కాఫీ కలుపుతున్న తన అక్కని చూసి ఆశ్చర్యపోయింది సావిత్రి.

'ఇదేమిటి? నువ్వు కాఫీ కలుపుతున్నావ్? శాస్త్రిగా రేమయ్యారు?' అంటూ శాస్త్రి గది తలుపు తీసింది. అంతే! ఖాళీగా వున్న గది చూసి కొయ్యబారిపోయింది సావిత్రి.

బ్రష్ చేత్తో పట్టుకు అటే వస్తున్న శర్మ, సావిత్రిని చూసి 'ఏం అలా చూస్తూనుంచున్నావ్?' అన్నాడు దగ్గిరికి వస్తూ.

'శాస్త్రిగారు వెళ్ళిపోయారు'

శర్మ సావిత్రి దగ్గిరికి వచ్చి, చెయ్యి పట్టుకున్నాడు.

'పోనీవే వెళ్ళిపోతే పీడాపోయే! పాత్ర మెరిగి దాన మియ్యమన్నట్టే, మనుష్యులని తెలుసుకు అభిమానం, ప్రేమ యియ్యాలి. నీ మంచితనాన్ని వాళ్ళు కొల్లగొట్టుకున్నారు.' ●

